ప్రజా విశ్వంభర
V3 NEWS

# ఈరోజు బతికిపోయాను దేవుడా.. అనుకునేదాన్ని

అనుపమ పరమేశ్వరన్ నటించిన తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మరోసారి తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. గతంలో వేధింపుల కారణంగా తాను ఎంతగానో కుంగిపోయానని.. ఒక దశలో సినిమాలకు స్వస్తి చెప్పాలని భావించినట్లు ఆమె తెలిపారు."అద్దంలో చూసుకున్నప్పుడు నేనేనా అనిపించేది. ప్రతిరోజు భారంగా జీవితాన్ని నెట్టుకొచ్చాను. ఒక్కరోజు కూడా ఆస్వాదించేలా గడవలేదు. నిరంతరం పోరాడాల్సి వచ్చేది. రోజు ముగిసే-సరికి 'ఈరోజు బతికిపోయాను దేవుడా' అనిపించేది. జీవితమే ఓ సవాలుగా మారిపోయింది. ఆ పరిస్థితుల్లో యాక్టింగ్ కూడా మానేద్దాం అనుకున్నా. కానీ, ధైర్యంగా కొనసాగించా" అని అనుపమ వివరించారు.ఇక ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడినప్పుడు విమర్శలు వస్తాయని భావించానని, కానీ చాలా మంది నుంచి తనకు ఎంతో మద్దతు లభించిందని అనుపమ తెలిపారు. 'నా అనుభవాలు కొందరిలో అయినా ధైర్యం నింపుతాయనుకుంటే.. నేను ఎన్ని విమర్శలకైనా సిద్ధమే' అని చెప్పారు.



# అరుదైన అనుభూతే నాకు అతిపెద్ద రెమ్యునరేషన్



2026లో బాక్సాఫీస్ రికార్డులన్నింటినీ తిరగరాస్తూ రూ. 1,000 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోయిన చిత్రం 'ధురంధర్: ది రివెంజ్'. రణ్‌వీర్ సింగ్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టించింది. ఈ క్రేజీ మూవీ సక్సెస్ వెనుక ఎన్నో విశేషాలు ఉండగా.. ముఖ్యంగా ఇందులో డైరెక్టర్ భార్య, ప్రముఖ నటి యామి గౌతమ్ చేసిన స్పెషల్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. పాకిస్థాన్ గడ్డపై దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రహస్యంగా పనిచేసే అండర్‌కవర్ ఇండియన్ ఏజెంట్ 'షాజియా బానో' నర్సు పాత్రలో యామి అద్భుతంగా నటించింది. అయితే ఈ సినిమాలో చిన్న అతిథి పాత్ర చేయడం కోసం ఆమె కోట్లలో రెమ్యునరేషన్ తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ షోలో పాల్గొన్న యామీ గౌతమ్ అసలు నిజం బయటపెట్టారు. ఆ రోల్ కోసం తాను భారీ చెక్కు తీసుకున్నానని చాలామంది అనుకున్నారని, కానీ ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెట్టలేమని స్పష్టం చేశారు. తన భర్త ఆదిత్య స్వయంగా తన దగ్గరకు వచ్చి 'సినిమాలో గుడ్ లక్ కోసం నువ్వు తప్పకుండా ఆ ఫ్రేమ్‌లో ఉండాలి' అని కోరిన విధానం తనను ఎంతగానో కదిలించిందని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ దర్శకులలో ఒకరైన తన భర్త చేతిలో డైరెక్ట్ చేయించుకోవడం, ఆ అరుదైన అనుభూతిని పొందడమే తాను అందుకున్న అసలైన పారితోషికం అని యామి ఎమోషనల్ అయ్యారు. డబ్బు కంటే భర్తతో పంచుకున్న ఆ సృజనాత్మక సంతృప్తే తనకు చాలా గొప్పదని చెప్పుకొచ్చారు.

# ₹4,000 కోట్ల విజన్‌ను ఎగతాళి చేయడం సరికాదు..



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విజువల్ వండర్‌లో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా కేజీఎఫ్ స్టార్ యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, మండోదరిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న యష్.. సినిమాపై సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివిటీకి, విమర్శలకు తనదైన శైలిలో గట్టి సమాధానమిచ్చారు. సుమారు నాలుగు వేల కోట్ల భారీ విజన్‌తో తెరకెక్కుతున్న ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌కు అందరి మద్దతు, మంచి ఆశయం అవసరమని, అంతేకానీ సోషల్ మీడియాలో నిత్యం ఎగతాళి చేయడం సరికాదని ఆయన అన్నారు. సినిమాపై నిర్మాణాత్మక విమర్శలు ఉండవచ్చు కానీ, అసలు మూవీని చూడకుండానే ముందుగానే దాన్ని తప్పుబట్టడం సమంజసం కాదని స్పష్టం చేశారు. భారతీయ సినిమాను గౌరవించాలని యష్ పిలుపునిచ్చారు. ఇక తన గత చిత్రం 'టాక్సిక్' గురించి మాట్లాడుతూ.. అన్ని అడ్డంకులను ఎదుర్కొని ప్రేక్షకులు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి, భారీ కలెక్షన్లతో దానిని ఎంతగానో ప్రేమించారని, ఆదరించారని గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. తను కూడా ఒక నిర్మాతగా వ్యవహరిస్తున్నానని, ఈ 'రామాయణం' కూడా కర్ణాటక ఉత్పత్తి అని గర్వంగా చెబుతున్నానని యష్ పేర్కొన్నారు.

# సమస్య వచ్చినపుడు సహాయం చేయడంలో ముందుంటాం



ఎల్ నినోపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రీ ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై టాలీవుడ్ కింగ్, అక్కినేని నాగార్జున స్పందించారు. ఇట్లు అర్జున సినిమా ఈవెంట్ లో ఆయన దీనిపై మాట్లాడారు. ప్రపంచం మొత్తాన్ని ఎల్ నినో తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఎల్ నినోపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. సినిమా ఇండస్ట్రీలో అందరూ ముందుకు వచ్చి సహాయం చేస్తామన్నారు. సమస్య వచ్చినపుడు సహాయం చేయడంలో ఇండస్ట్రీ ఎప్పుడూ ముందుంటుందని నాగార్జున పేర్కొన్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందో ఎవరికీ తెలియదని, ప్రజలు పొదుపు చర్యలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే హెచ్చరించారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆ నివేదికను కేంద్రం వద్దకు తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా నీరు, విద్యుత్ కొరత రోజురోజుకూ తీవ్రతరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కూడా ఒక పంటను ఆపుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పురుషులు నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోండి..



బాలీవుడ్ బ్యూటీ స్వరా భాస్కర్ సినిమాలకు దూరమైనప్పటికీ 'రైజ్ అండ్ ఫాల్' అనే క్రేజీ రియాలిటీ షోలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. తన మూడేళ్ల కూతురితో ఎక్కువ సమయం గడపడానికి రియాలిటీ షోలే బెస్ట్ ఆప్షన్ అని స్వరా భాస్కర్ స్పష్టం చేశారు. సినిమాల్లో నటిస్తే ఎక్కువ రోజులు క్యారెక్టర్ మూడ్‌లోనే ఉండిపోవాల్సి వస్తుందని, కానీ రియాలిటీ షోలు అయితే తక్కువ సమయంలో పూర్తయి పాపతో ఉండేందుకు వీలవుతుందని ఆమె వెల్లడించారు. అలాగే తన నిజమైన వ్యక్తిత్వాన్ని చూపించడానికి ఇది మంచి ప్లాట్ ఫామ్ గా ఉపయోగపడతాయని అన్నారు. ఇక ప్రసవం తర్వాత తనపై వస్తున్న ట్రోల్స్, బాడీ షేమింగ్‌పై స్వరా భాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తల్లులయ్యే మహిళల శరీర ఆకృతిపై దారుణమైన కామెంట్లు చేసేవారికి కనీస మానవత్వం, తెలివితేటలు ఉండవని మండిపడ్డారు. ఐశ్వర్య రాయ్, కత్రినా కైఫ్ వంటి స్టార్లను కూడా ఇలాగే టార్గెట్ చేశారని గుర్తుచేస్తూ.. సన్నగా ఉండటంలోనే సౌందర్యం లేదని, ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహిళల శరీరాలపై ఉచిత సలహాలు, కామెంట్లు ఇచ్చే మగవాళ్లు తమ నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోవాలని స్వరా ఘాటుగా హెచ్చరించారు.

# కసబ్ ఉరిశిక్షకు నాలుగేళ్లు ఎందుకు పట్టింది?

## రివ్యూ: ప్రహార్..




**చిత్రం:** ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్; నటీనటులు: రాజ్‌కుమార్ రావ్, లలిత్ ప్రభాకర్, జైదీప్ అహ్లావత్, వామికా గబ్బీ, ఆశిష్ విద్యార్థి, సికిందర్ ఖేర్, నాజర్ తదితరులు; రచన: సుమిత్ రాయ్; నిర్మాత: దినేశ్ విజన్, దర్శకత్వం: అవినాష్ అరుణ్; విడుదల: 16102026.

**కథేంటంటే..**

ఉజ్వల్ నికమ్ (రాజ్ కుమార్‌రావ్) ప్రముఖ న్యాయవాది. 1993 బాంబే బ్లాస్టింగ్ కేసు విచారణలో కీలక పాత్ర పోషించడంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోతుంది. కట్ చేస్తే, 26/11 ముంబయి ఉగ్రదాడి ఘటన ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుంది. భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది ఉగ్రవాదులు హతమవగా, అజ్మల్ కసబ్ (లలిత్ ప్రభాకర్) ఒక్కడే సజీవంగా పట్టుబడతాడు. ఈ కేసు విచారణను మహారాష్ట్ర ప్రభుత్వం ఉజ్వల్ నికమ్‌కు అప్పగిస్తుంది. కసబ్ తరపున వాదించడానికి ఏ న్యాయవాది ముందుకు రాడు. ఈ క్రమంలో అబ్బాస్ ఖాజ్మీ (సికందర్ ఖేర్) ఆ బాధ్యతను తీసుకుంటాడు. 2008లో ఉగ్రదాడి ఘటన జరిగితే, 2012లో కసబ్‌కు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెబుతుంది. బాధితులకు న్యాయం జరగడానికి నాలుగేళ్ల సమయం ఎందుకు పట్టింది?కసబ్ ఉగ్రవాదేనని నిరూపించడానికి ఉజ్వల్ నికమ్ ఎలాంటి ఆధారాలు సమర్పించారు? ఈ క్రమంలో ఆయనకు ఎదురైన సవాళ్లు ఏంటి? అన్నది చిత్ర కథ.

**ఎలా ఉందంటే..**

ముంబయి మారణహోమంలో అజ్మల్ కసబ్ నిందితుడేనని అందరికీ తెలుసు. అందుకు ఆధారాలు, సాక్ష్యాలు కూడా ఉన్నాయి. కానీ, నాలుగేళ్ల పాటు అతడి భద్రత, న్యాయపరమైన వ్యవహారాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించింది. 'ప్రభుత్వానికి ఏం పనీ పాటా లేదు. వాడ్ని అనవసరం కూర్చోబెట్టి మేపుతోంది. కాల్చి అవతల పారేసేయొచ్చుగా' అని చాలా మంది అనుకుని ఉంటారు. కోర్టులో వాదనల సందర్భంగా ఉజ్వల్ నికమ్ కూడా చాలా మంది అనుకున్న అభిప్రాయాన్నే చెబుతూ 'నేటి సమాజం సత్వర న్యాయం (ఇన్‌స్టంట్ జస్టిస్) కోరుకుంటోంది. అలాంటి న్యాయం వల్ల బాధితులకు వెంటనే ఉపశమనం లభించవచ్చు. కానీ, ఆ కుట్ర వెనుక ఎన్నో విషయాలు బయటకు రాకుండా పోతాయి' అంటారు.ఉగ్రవాది అజ్మల్ కసబ్ పట్టుబడిన తర్వాత విచారణ సందర్భంగా చోటు చేసుకున్న ఎన్నో విషయాలను ఆసక్తికరంగా న్యాయవాది ఉజ్వల్ నికమ్ దృష్టి కోణం నుంచి 'ప్రహార్'ను అలరించేలా, భావోద్వేగాన్ని పంచేలా తీర్చిదిద్దడంలో దర్శకుడు అవినాష్‌అరుణ్ విజయం సాధించారు. అది మాత్రమే కాదు, అంతర్లీనంగా భారత్‌పాకిస్థాన్ మధ్య సంబంధాలను స్పృశిస్తూ వాటిని ఆవిష్కరించిన తీరు మెప్పిస్తుంది. కేవలం కోర్టు రూమ్ డ్రామాగానే నడిపితే ఇదొక డాక్యుమెంటరీ అయ్యేది. అలాగని, ఉగ్రదాడి.. వారిపై భద్రత బలగాల ఆపరేషన్ చూపిస్తే యాక్షన్ థ్రిల్లర్ అయిపోతుంది. అవన్నీ చూసేశాం. కోర్టు విచారణ ప్రధానంగా చూపిస్తూనే ఉగ్రమూక సృష్టించిన నరమేధాన్ని సమపాళ్లలో మేళవిస్తూ అరుణ్ ఈ కథను ఒక ఎమోషనల్ కోర్టు డ్రామాగా ఆవిష్కరించారు.

ముంబయి ఉగ్రదాడి ఘటనను ఫ్లాష్‌లా చూపిస్తూ నేరుగా కోర్టు విచారణకు తీసుకొచ్చేశాడు దర్శకుడు. కసబ్ తరపున వాదించే న్యాయవాది అబ్బాస్ ఖాజ్మీ సంధించే ప్రశ్నలు, తీసే లాజిక్‌లకు సరైన సమాధానాలు చెప్పలేక పోలీసులు, సాక్షులు నీళ్లు నమలడం వాదనల్లో అతడిదే పై చేయి అయ్యేలా సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది. మొదట్లో ఉజ్వల్ నికమ్ వెనుకబడినట్లు అనిపించినా, అసలు కథ ముందుందని సగటు ప్రేక్షకుడికి ఇట్టే అర్థమవుతుంది. పోలీసు కస్టడీలో ఉన్న కసబ్ ప్రవర్తన, వ్యవహారశైలి ఎలా ఉండేదో మనం అనేక కథనాలు చదివాం. అవన్నీ తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. తాను మైనర్‌నని కాసేపు, పోలీసులు తనని హింసించి నిజం ఒప్పించారని మరికాసేపు, లేదు తాను అమితాబ్ బచ్చన్ ఇల్లు చూడటానికి వస్తే పోలీసులు పట్టుకుని ఉగ్రవాదనంటూ అరెస్ట్ చేశారని.. ఇలా కసబ్ ఆడిన నాటకాలన్నీ తెరపై చూపించారు. ప్రథమార్ధమంతా ఇదే తరహాలో సాగుతుంది.

ద్వితీయార్ధంలో కోర్టు రూమ్ డ్రామా నడిపిస్తూనే ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఎలా ఎగదోస్తుంది? అక్కడి అమాయక ప్రజలకు డబ్బు ఆశ చూపి వారిని జిహాదీలుగా ఎలా మారుస్తుంది? వంటి ఎన్నో వాస్తవాలను తెరపై ఆవిష్కరించారు. అదే సమయంలో కోర్టులో బాధితుల దృష్టి కోణం నుంచి భావోద్వేగాలను పంచే ప్రయత్నమూ చేశారు. ముఖ్యంగా చిన్నారి సాక్ష్యం చెప్పే సన్నివేశం కన్నీళ్లు తెప్పిస్తుంది. అయితే, కొన్ని సన్నివేశాలు వాస్తవానికి దూరంగా అనిపిస్తాయి. ఉజ్వల్ తన కుటుంబాన్ని సైతం పక్కన పెట్టి రాత్రీ పగలూ తేడా లేకుండా ఈ కేసు విచారణకు కష్టపడినట్లు చూపించారు కానీ, కోర్టుకు అవసరమైన ఆధారాలు సేకరించడంలో ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఈ క్రమంలో ఆయనకు ఎదురైన సవాళ్లేంటి? అన్న అంశాల జోలికి పోలేదు. దీంతో కథ, కథనాలు ఫ్లాట్‌గా సాగుతాయి. ఎక్కడా థ్రిల్ పంచే సన్నివేశం కనిపించదు. ఉజ్వల్ కుటుంబం నేపథ్యంలో సాగే డ్రామాగా కూడా కాస్త సాగదీత వ్యవహారంలా అనిపిస్తుంది.

**ఎవరెలా చేశారంటే..**

ఉజ్వల్ నికమ్ పాత్రలో రాజ్ కుమార్ రావ్ ఒదిగిపోయారు. ఆయన నటన ఆద్యంతం సటిల్డ్‌గా ఉంది. వాదనలు వినిపించే క్రమంలోనూ, బాధితుల ప్రతినిధిగా వాస్తవాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చే సమయంలో ఆయన ముఖంలో కనిపించే ఆర్ద్రత, హావభావాలతో కట్టిపడేశారు. ప్రత్యర్థి లాయర్‌గా సికందర్ ఖేర్ కూడా చక్కగా నటించారు. కోర్టులో బలమైన వాదన ఉంటుంది కానీ, కమర్షియల్ సినిమాల్లో చూపించినట్లు అరుపులు, కేకలు అస్సలు ఉండవు. ఉజ్వల్ భార్య పాత్రలో వామికా గబ్బీ, కుమారుడు అకేంత్‌గా రిత్విక్ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఇక అజ్మల్ కసబ్‌గా లలిత్ ప్రభాకర్ (Lalit Prabhakar) నటన సినిమాకు హైలైట్. విచారణకు ఒక్క తీరుగా ఆయన పలికించిన హావభావాలు బాగున్నాయి. పాక్ న్యాయవాదిగా జైదీప్ అహ్లావత్ మెరుస్తారు. మిగిలిన వాళ్లు పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. నేపథ్య సంగీతం కోర్టు, బాధితుల భావోద్వేగ సన్నివేశాలను ఎలివేట్ చేసింది. దర్శకుడు అవినాష్ అరుణ్ కమర్షియల్ హంగులకు పోకుండా వాస్తవాలను ఉజ్వల్ నికమ్ దృష్టి కోణం నుంచి ఆవిష్కరించిన తీరు బాగుంది.

**బలాలు**

+ రాజ్‌కుమార్‌రావ్ నటన
+ కోర్టు సన్నివేశాలు
+ ప్రథమార్ధం, క్లైమాక్స్

**బలహీనతలు**

బోరింగ్ ఫ్యామిలీ డ్రామా
నిడివి

చివరిగా: 'ప్రహార్'.. 26/11 ఉగ్రదాడి.. ప్రేక్షకులు చూడని సరికొత్త కోణం

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com